క్లుప్తంగా

ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంపై అవగాహన



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద మండలం ఎంపికవ్వడంతో శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామస్థాయి సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.జ్యోతి బ్రహ్మం, గ్రామ కార్యదర్శులు వీరభద్రరావు, హలీమ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వత్సవాయి విద్యార్థి



వత్సవాయి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు వత్సవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాయపాటి సాధు సుధాకరసింగ్ ఎంపికైనట్లు హెచ్ఎం ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ నెల 20న గుడివాడలో జరిగిన స్కూల్‌గేమ్స్‌లో వాలీబాల్‌లో ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచి 67వ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థిని సిబ్బంది, పీడీ మార్కపూడి బాబురావు ప్రత్యేకంగా అభినందించారు.

నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా హనోక్



నందిగామ: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా కొండూరు హనోక్ నియమితులయ్యారు. పట్టణ శివారు డీవీఆర్ కాలనీలోని కృపా ప్రార్థనా మందిరంలో శుక్రవారం నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొక్క జార్జి ముల్లర్ కొండూరు హనోక్‌ను ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించి నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పలు మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఆహ్వానం

నందిగామ: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పది, ఇంటర్మీడియట్ చదవాలనుకునేవారు ఈనెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాబురావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశమిచ్చిందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 28వ తేదీ లోపు వార్డు, గ్రామ సచివాలయాల ద్వారా లేకపోతే ఏపీ ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 8977645706 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

దసరా పనులకు ఆటంకం లేకుండా చూడాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా పనులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా కొండ చరియలు, మట్టి తొలగింపు పనులు వేగంగా చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. దుర్గాఘాట్ ఎదుట ఇటీవల కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఘాట్‌రోడ్డు నుంచి కొండ దిగువకు జారిన మట్టి, కొండ చరియలను త్వరితగతిన తరలించాలని ఈఈ ఎల్. రమాదేవికి సూచించారు. దసరా ఉత్సవాలకు గడువు ముందుకు వస్తున్నందున పనులు వేగంగా జరగాలని సూచించారు. దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన సిబ్బంది క్వార్టర్స్‌లో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో చైర్మన్ కర్నాటి రాంబాబు పాల్గొన్నారు. శుక్రవారం గుణదలలోని క్వార్టర్స్‌కు చేరుకున్న ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చవితి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు. అనంతరం సిబ్బంది క్వార్టర్స్‌ను పరిశీలించారు.

మందుల దుష్ఫలితాలపై అవగాహన

లబ్బీపేట(విజయవాడతూర్పు):జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మందులు దుష్ఫలితాలు వచ్చినప్పుడు తక్షణమే ఏమి చేయాలి, ఎవరిని సంప్రదించాలనే అనే అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహించడంతో పాటు రంగోలి, నాటకం, ఫ్లాష్‌మాబ్ ప్రదర్శన ద్వారా ప్రజలు, రోగుల్లో అవగాహన కలిగిస్తూ చైతన్యం నింపుతున్నారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.వెంకట రమణ, ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణలత పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పరిపూర్ణ ఆరోగ్యం



నందిగామలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నందిగామ: చిరుధాన్యాలతో పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యరేణుక సూచించారు. పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో కిశోర బాలికల పోషణకు సంబంధించి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ కిశోర బాలికలకు రక్తహీనత లేకుండా ఉండటానికి నిత్యం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ర్యాలీలో పలు పాఠశాలల విద్యార్థినులు, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోగులూరు(కంచికచర్ల) : చిరుధాన్యాలు తీసుకుంటే రక్తహీనతకు గురికాకుండా ఉంటారని బాలికలు రుచికరమైన ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరీమా అన్నారు. మోగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కిశోరబాలికలకు ఆరోగ్యంపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు చిన్నతనం నుంచే జంక్ ఫుడ్ తీసుకునేందుకు ఎక్కువ ఆసక్తి కనపరుస్తున్నారని ఇది ఆరోగ్యానికి మంచిదికాదని హితవు పలికారు. చిరుధాన్యాల ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం పలు విభాగాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గండ్రాయి(జగ్గయ్యపేట):పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలోని చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు శుక్రవారం సైకిల్ ర్యాలీ చేశారు. ప్రాజెక్టు అధికారి లక్ష్మీభార్గవి మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు పౌష్టికాహారం తీసుకోవడంలో శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని కోరుతూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



గండ్రాయిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో కిశోర బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంలో రోజువారీ తీసుకుంటే రోగ నిరోధకశక్తి పెరగటంతో పాటు ఉత్తేజంగా, ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌కేలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేవీర్ జెడ్పీ హైస్కూల్లో బాలికలతో మానవహారం

వెల్లంకి(వీరులపాడు): కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి పేర్కొన్నారు. వెల్లంకి గ్రామంలో శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల్లో రక్తహీనత లోపం కనిపిస్తుందని దీని నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గృహ సారథులు, బూత్ లెవల్ ఏజెంట్‌లపై గురుతర బాధ్యతలుంచారని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ కుమార్ పేర్కొన్నారు. నందిగామ పట్టణ సమీపంలోని ఆర్ఎస్ గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి నందిగామ మండల వైఎస్సార్ సీపీ గృహ సారథులు, బీఎల్ఏలతో సమావేశం నిర్వహించారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు ఎంత వరకు మంచి చేయగలమో అంతకుమించి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారన్నారు. ప్రజల ఇళ్ల ముంగిటకే పాలన తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మంచాల చంద్రశేఖర్, ఎంపీపీ అరిగెల సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అమ్రపాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు):పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రముఖ చిత్రకారిణి అమ్రపాలి అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో పర్యావరణ వేత్త యలవర్తి నాయుడమ్మ 101వ జయంతి సందర్భంగా జాషువా సాంస్కృతిక వేదిక, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, 64 కళలు డాట్ కం ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణంపై బాలబాలికలు వేసిన చిత్రాల ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అమ్రపాలి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు ఎంతో ఆలోచనాత్మకంగా చిత్రాలు గీశారన్నారు. ఇప్పటికే పర్యావరణం అసమతుల్యంగా మారిందని ఆవేదన చెందారు. నేటి చిన్నారులు పర్యావరణ పరిరక్షణకు నడుంకట్టాలని పిలుపునిచ్చారు. నాయుడమ్మ దేశంలో గొప్ప శాస్త్రవేత్తల్లో ఒకరని, లెదర్ టెక్నాలజీలో విశేష కృషి చేశారని కొనియాడారు. నాయుడమ్మను స్మరించుకుంటూ చిన్నారులు మరిన్ని మంచి చిత్రాలు గీయాలని కోరారు. స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణంపై చిన్నారులు గీసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని అభినందించారు. 64 కళలు డాట్ కం బాధ్యుడు కళాసాగర్ మాట్లాడుతూ వైజ్ఞానిక రంగంలో, పర్యావరణానికి నాయుడమ్మ ఎంతో కృషి చేశారన్నారు. చిన్నారులు పర్యావరణంపై వేసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యుడు గుండు నారాయణరావు, ఫోరంఫర్ ఆర్టిస్ట్స్ బాధ్యులు గిరిధర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.50 లక్షలతో ఆయుర్వేద ఆసుపత్రి మరమ్మతులు



సమావేశంలో వైద్యాధికారి, సర్పంచ్, పీఆర్ ఏఈ

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి భవన మరమ్మతులకు రూ.3.50 లక్షలు మంజూరైనట్లు వైద్యాధికారి వై.రత్నప్రియదర్శిని అన్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఆసుపత్రిలో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, పీఆర్ ఏఈ సుందరరామయ్య, సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావుతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ కింద అనిగండ్లపాడు ఆయుర్వేద ఆసుపత్రి ఎంపికైందని, నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా భవన మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వీటితో అత్యవసర మరమ్మతులు చేస్తారన్నారు. త్వరలో పంచకర్మ వైద్యం కూడా అందుబాటులోకి వస్తుందని, గ్రామస్తులు సహకరించాలని కోరారు.

అనారోగ్యంతో సచివాలయ ఉద్యోగి మృతి



శ్రీనివాసరావు

శివాపురం(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు సచివాలయంలో ఆర్‌బీకే అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేసి ప్రస్తుతం ముచ్చింతలలో ఇన్‌చార్జ్‌గా ఉన్న దైద శ్రీనివాసరావు(39) గురువారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. మృతదేహాన్ని శుక్రవారం ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, అనిగండ్లపాడు సర్పంచ్ జ్యోతిబ్రహ్మం, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, సొసైటీ అధ్యక్షులు పిడికిటి కోటేశ్వరరావు, శ్రీతిరుపతమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడు లగడపాటి జనార్దన్, ఆలయ ధర్మకర్త కురువెళ్ల రాయప్ప తదితరులు సందర్శించి నివాళులర్పించారు. శ్రీనివాసరావు కుటుంబానికి అనిగండ్లపాడు సచివాలయ కార్యదర్శులు వీరభద్రరావు, హలీమ్ ఆధ్వర్యంలో సిబ్బంది రూ.26 వేలు, సర్పంచ్ బిజ్యోతి బ్రహ్మం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ

నందిగామ: పట్టణంలోని ఆరో వార్డులో శుక్రవారం ప్రత్యేక పరిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వార్డు కౌన్సిలర్ యాకూబ్ అలీ, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంటైనర్ లారీని ఢీకొట్టిన కెమికల్ లారీ



లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహం



మృతి చెందిన డ్రైవర్ బాషా

పులపర్తి హైవే వద్ద ప్రమాదంలో డ్రైవర్ మృతి

యలమంచిలి: జాతీయ రహదారిపై ఆగిఉన్న కంటైనర్ లారీని రసాయనాల లోడుతో వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. యలమంచిలి రూరల్ ఎస్సై కె.సన్నిబాబు తెలిపిన వివరాల ప్రకారం పరవాడ ఫార్మా పరిశ్రమ నుంచి రసాయనాల డ్రమ్ముల లోడుతో ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మొగలూరు గ్రామానికి చెందిన షేక్ చాంద్ బాషా(47) లారీతో గుజరాత్ వెళ్తున్నాడు. గురువారం రాత్రి యలమంచిలి మండలం పులపర్తి జాతీయ రహదారి జంక్షన్ వద్ద ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో డ్రైవర్ చాంద్ బాషా లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర గాయాల పాలై ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వక్ఫ్ బోర్డ్ ఆస్తుల పరిశీలన



తిరుమలగిరిలో భూములను పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్

తిరుమలగిరి(జగ్గయ్యపేట): జిల్లాలో వక్ఫ్‌బోర్డు ఆస్తుల సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ చెప్పారు. వక్ఫ్ ఆస్తుల పరిశీలనలో భాగంగా శుక్రవారం గ్రామంలోని 9.50 ఎకరాల భూమిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భూమి లీజుదారుడు 12 ఏళ్ల లీజు గడువు ముగిసినా వక్ఫ్ బోర్డుకు రుసుం చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేయటంతో పాటు నోటీసులు జారీ చేశామని తెలిపారు. నియోజకవర్గంలోని 34 ఎకరాల వక్ఫ్ భూములతో పాటు ఇతర ఆస్తులున్నాయని వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బండిపాలెం, పెనుగంచిప్రోలులో వక్ఫ్ భూముల కౌలుదారులు నిబంధనలు పాటించటం లేదని తమ దృష్టికి రావటంతో పరిశీలించి సూచనలు చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు కార్యదర్శి మహ్మద్ జుబేర్, వక్ఫ్‌బోర్డు అధికారి షేక్ కరిముల్లా, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ అబ్దుల్, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): స్థానిక ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌బాషా బంధువు విశ్రాంత ఎలక్ట్రికల్ ఇంజినీర్ మహమ్మద్ ఖాలీరూర్ రెహ్మాన్ గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ మోగులూరు ఏలిషా సహకారంతో బ్యాగులు, స్నాక్స్ బాక్స్‌లు, స్టీల్ వాటర్ బాటిల్స్, రాత పుస్తకాలు, పెన్సిల్ కిట్లు, పెన్నులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ పాలడుగు జోత్స్న, ఎంఈఓ సీహెచ్ పుష్పలత పాల్గొని విద్యార్థులకు అందజేశారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమెరికా దేశస్తుడు నాథన్, లిండ్సే, గ్రామ సర్పంచ్ నళిని ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి విశేష పూజలు



శ్రీతిరుపతమ్మ ఆలయంలో గణనాథుడు



గరిక పత్రాల అలంకరణలో రైతుపేటలోని గణనాథుడు

పెనుగంచిప్రోలు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తులు విఘ్నాధిపతికి విశేష పూజలు జరుపుతున్నారు. నవరాత్రుల్లో ఐదో రోజు శుక్రవారం గ్రామంలోని శ్రీతిరుపతమ్మ ఆలయంలో మట్టి గణనాథుడికి ప్రత్యేక పూజలతో పాటు గణపతి హోమం చేశారు.

వీరులపాడు: మండలంలోని పెద్దాపురం, జయంతి, జుజ్జూరుతో పాటు ఆయా గ్రామాల్లో ప్రధాన కూడళ్ల, ఆలయాల్లో కొలువుదీరిన గణనాథులకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో ఐదోరోజు వినాయక నిమజ్జన కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన వాహనంపై స్వామి వారిని ఉంచి భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నందిగామ: ఉత్సవాల్లో ఐదో రోజు శుక్రవారం పలుచోట్ల సామూహిక కుంకుమ పూజలు చేశారు. ముక్కోటి మండపంలో ఏర్పాటు చేసిన పర్యావరణ గణపతి వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మెయిన్ బజార్‌లోని గణనాథుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. గాంధీసెంటర్‌లో భారీ అన్నదానం జరిగింది. ఉదయం 11 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం కొనసాగించారు.

వత్సవాయి: మక్కపేటలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద రేపు లడ్డూ వేలంపాట నిమిత్తం 105 కేజీల లడ్డును ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. నిమజ్జనాల సందర్భంగా నిర్వాహకులు జాగ్రత్త వహించాలని ఎస్ఐ అభిమన్యు తెలిపారు.



డాక్టర్స్ రోడ్డులో..

కంచికచర్ల: వినాయక చవితి పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో వాణిజ్య గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన గణనాథుడికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎస్ఐలు పీవీఎస్ సుబ్రహ్మణ్యం, హైమావతి స్వామి వారికి విశేష పూజలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో విగ్రహాలను కమిటీ సభ్యులు నిమజ్జనం చేశారు. స్థానిక పెట్రోలు బంక్ సెంటర్‌లో బాల వినాయక కమిటీ సభ్యులు స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిగింది. మండలంలోని గండేపల్లిలో కీసర మున్నేటిలో వినాయక నిమజ్జనం చేశారు.

జగ్గయ్యపేట: అనుమంచిపల్లి, రామచంద్రునిపేట, అగ్రహారం, ముక్త్యాల గ్రామాల్లో వినాయకుని మంటపాల వద్ద నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. పట్టణంలోని పాత శివాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని మంటపంలో మూడు ఆకృతులలో కొలువుదీరిన వినాయకుడు ఆకట్టుకుంటున్నాడు. కైలాసగిరి సెట్టింగులు ఏర్పాటు చేసి కృష్ణుడు, సుబ్రహ్మణ్య స్వామి ఆకారంలో ఏర్పాటు చేసిన గణనాథుడు ఆకట్టుకుంటున్నాడు.

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక సీతారామపురంలోని డాక్టర్స్ రోడ్‌లో రైడర్స్ యూత్ ఆధ్వర్యాన సుమారు రూ.7 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన 24 అడుగుల గణేష్ విగ్రహం ఆకర్షణీయంగా నిలిచింది. రైడర్స్ యూత్ సభ్యులు అరవింద్, చందు, రాజు తదితరులు పాల్గొన్నారు. వాసవి లైబ్రరీ వీధిలో వ్యాపారులు, జగ్గయ్యపేట పట్టణ, నియోజకవర్గ ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద భారీ అన్నదానం జరిగింది.

కొనసాగుతున్న నిమజ్జనాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):గణేష్ నిమజ్జనాలు ఐదో రోజు అత్యంత వైభవంగా కొనసాగాయి. శుక్రవారం పెద్ద సంఖ్యలో నిమజ్జనాలు కొనసాగాయి. మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకూ కొనసాగుతూనే ఉన్నాయి. వన్‌టౌన్‌లోని ప్రధాన రహదారులన్నీ కళకళలాడుతున్నాయి. జైబోలో గణేష్ మహారాజ్‌కీ జై అనే నినాదాలు వన్‌టౌన్‌లో మార్మోగుతున్నాయి. అడుగు నుంచి భారీ విగ్రహాలన్నీ వరుసగా కృష్ణానదికి తరలివెళ్తున్నాయి. ఈ సందర్భంగా ఆయా చవితి పందిళ్ల నిర్వాహకులు మేళతాళాలతో, కోలాట విన్యాసాలు, జానపద కళారూపాలతో నృత్యాలు చేసుకుంటూ సందడి చేస్తున్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి విగ్రహాలకు వన్‌టౌన్ మీదుగా కృష్ణానదికి తరలివెళ్లాల్సి రావడంతో ఈ ప్రాంతాలన్నీ సందడిగా దర్శనమిస్తున్నాయి. గవర్నరుపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు ఫ్లై ఓవర్, కెనాల్‌రోడ్డు, రథం సెంటర్ తదితర ప్రాంతాల మీదుగా కృష్ణానదికి చేరుకుంటున్నాయి. కేటీ రోడ్డు, మెయిన్‌బజార్, బ్రాహ్మణవీధి, కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా తరలివెళ్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలన్నీ ఊరేగింపులతో కిక్కిరిసి దర్శనమిస్తున్నాయి. కృష్ణవేణి హోల్‌సేల్ మార్కెట్‌లో వినాయకచవితి వేడుకలు శుక్రవారం ముగిశాయి. రాత్రి స్వామి వారి నిమజ్జన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మార్కెట్ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్ కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. భేతాళ నృత్యాలు, డప్పు విన్యాసాలు, డీజే శబ్దాలతో సందడి చేస్తూ ఊరేగింపు ముందుకు సాగింది. కార్యక్రమంలో వెలంపల్లి రాఘవ, వల్లంకొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.